APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 01 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :65 పేజీలు : 04 వెల: 2-00/-



## రాహుల్‌కు అరుదైన ఘనత చేరువ

న్యూఢిల్లీ, జూలై 31 : భారత క్రికెట్ జట్టు శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. సిరీస్‌కు ముందు టీమిండియా ఒక ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ పాల్గొననుంది. తొలి టెస్టు గాలే అంతర్జాతీయ మైదానంలో, రెండో టెస్టు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఈ సిరీస్ భారత స్టార్ వికెట్‌కీపర్-బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు ఎంతో ప్రత్యేకంగా మారనుంది. ఎందుకంటే భారత క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఆటగాడూ నమోదు చేయని అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకునే అవకాశం ఉంది.అంతర్జాతీయ క్రికెట్‌లో 10 వేల పరుగుల మైలురాయికి కేఎల్ రాహుల్ కేవలం 170 పరుగుల దూరంలో ఉన్నారు. ఇప్పటివరకు మూడు ఫార్మాట్లలో కలిపి ఆయన 9,830 పరుగులు సాధించారు. శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్‌లో ఈ పరుగులు పూర్తి చేస్తే 10 వేల పరుగుల క్లబ్‌లో చేరడంతో పాటు మరో విశేషమైన రికార్డును తన పేరిట నమోదు చేసుకుంటారు.అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క బంతి కూడా బౌలింగ్ చేయకుండా 10 వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత ఆటగాడిగా కేఎల్ రాహుల్ నిలవనున్నారు. ఇప్పటివరకు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ బ్యాటర్లు తమ కెరీర్‌లో ఏదో ఒక దశలో బౌలింగ్ చేశారు. కానీ కేఎల్ రాహుల్ మాత్రం ఇప్పటివరకు అంతర్జాతీయ స్థాయిలో ఒక్క బంతి కూడా వేయలేదు. అయినప్పటికీ అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా ఇప్పటికే అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.బౌలింగ్ చేయకుండా అత్యధిక అంతర్జాతీయ పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో కేఎల్ రాహుల్ 9,830 పరుగులతో తొలి స్థానంలో ఉన్నారు.అజింక్య రహానే 8,414 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, రిషభ్ పంత్ 5,637 పరుగులతో మూడో స్థానంలో ఉన్నారు.

## మోదీ పర్యటనపై సీఎం సమీక్ష

- భోగాపురం ఏర్పాట్లపై వీడియో సమావేశం
- తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ఆదేశం
- థింసా నృత్యంతో ఘన స్వాగతం
- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, జూలై 31 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ప్రారంభం కానున్న శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. విమానాశ్రయ ప్రాంగణం తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా అలంకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటిచెప్పే విధంగా ప్రతి ఏర్పాటూ ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గిరిజన సంప్రదాయ థింసా నృత్యంతో ఘన స్వాగతం పలకాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రపంచ రికార్డు స్థాయిలో నిర్వహించనున్న థింసా నృత్య ప్రదర్శన విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు కె. అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమం రాష్ట్ర ప్రతిష్ఠను పెంచేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.



## ఉద్యోగుల ఆరోగ్యంపై సీఎస్ సమీక్ష

- ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్‌ను బలోపేతం చేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశం
- చికిత్స ప్యాకేజీ రేట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని సూచన
- ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఉప కమిటీల ఏర్పాటుకు నిర్ణయం
- అత్యవసర వైద్య సేవలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 31: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ట్రస్ట్ నిధులను సద్వినియోగం చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించిన ట్రస్ట్ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు



- 13 వేల మందితో అద్భుత ప్రదర్శన
- భోగాపురంలో చారిత్రక ఘట్టం
- మంత్రి సంధ్యారాణికి రికార్డు ధ్రువీకరణ
- గిరిజన సంస్కృతికి ప్రపంచ గుర్తింపు

విజయనగరం, జూలై 31 : ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో గిరిజన విద్యార్థినులు, మహిళలు చారిత్రాత్మక ఘనత సాధించారు. సుమారు 13 వేల మంది ఏకకాలంలో సంప్రదాయ థింసా నృత్యాన్ని ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ భారీ ప్రదర్శన దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికేందుకు ఈ థింసా నృత్య ప్రదర్శనకు సన్నాహాలు చేపట్టారు. అందులో భాగంగా నిర్వహించిన రిహార్సల్‌లోనే భారీ సంఖ్యలో గిరిజన మహిళలు, విద్యార్థినులు పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారు.మన్యం ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వివిధ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థల పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ గులాబీ రంగు చీరలు, ఆకుపచ్చ అంచులతో అలంకరించుకుని లయబద్ధంగా థింసా నృత్యం చేసి ప్రేక్షకులను అలరించారు. ఈ ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నిర్దేశించిన అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన జరిగినట్లు ధ్రువీకరించిన అనంతరం దీనిని అధికారికంగా గిన్నిస్ ప్రపంచ రికార్డుగా ప్రకటించారు. ప్రభుత్వ తరఫున గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యంలో పాల్గొనడం విశేష ఆకర్షణగా నిలిచింది.



## డిజిటల్ భద్రతపై ఎంపీ పిలుపు


- మిషన్ గ్రాహక్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ
- డిజిటల్ అవగాహనపై దృష్టి
- సైబర్ భద్రతకు ప్రాధాన్యం
- సురక్షిత లావాదేవీలపై సూచనలు

న్యూఢిల్లీ, జూలై 31: నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు న్యూఢిల్లీలో నిర్వహించిన "మిషన్ గ్రాహక్ హ్యాండ్‌బుక్ -- స్మార్టర్ షాపర్స్, సేఫర్ ఛాయిసెస్" ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యోపన్యాసం చేశారు. సేఫర్ ఇంటర్నెట్ ఇండియా, అమెజాన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిజిటల్ వినియోగదారుల భద్రత, అవగాహన, సైబర్ రక్షణ అంశాలపై ఆయన ప్రసంగించారు. భారత్‌లో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అదే స్థాయిలో వినియోగదారుల్లో అవగాహన, సైబర్ భద్రతపై చైతన్యం, డిజిటల్ అక్షరాస్యత పెరగాల్సిన అవసరం ఉందని లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ప్రజలు విశ్వాసంతో డిజిటల్ సేవలను వినియోగించేలా బలమైన, విశ్వసనీయమైన డిజిటల్ వ్యవస్థను నిర్మించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు ప్రజల దైనందిన జీవితంలో కీలక భాగంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పౌరుడు సురక్షితమైన డిజిటల్ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు వినియోగదారుల రక్షణ కోసం సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రజల్లో డిజిటల్ భద్రతపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

అనంత సూర్య
తెలుగువార్త



# 22-ఎ నిషేధిత జాబితా భూముల పరిష్కార బాధ్యత ఇక ఆర్డీఓలకే



పుట్టపర్తి,జూలై 31అనంత సూర్య్::ప్రజల ఏళ్ల నాటి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు,భూగర్భ జలాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రెవెన్యూ, సర్వే అధికారులకు జారీ చేసిన ముఖ్యమైన ఆదేశాలు.గతంలో 22-ఎ నిషేధిత జాబితా భూముల తొలగింపు ప్రతిపాదనల ప్రక్రియ కలెక్టర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం ఆ బాధ్యతలను ఆర్డీవో లకు అప్పగించారు.రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న 22-ఎ సంబంధిత ఫైళ్లన్నింటినీ రాబోయే రెండు వారాల్లోగా పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలి.భూగర్భ జల శాఖ నుంచి ముందస్తు అనుమతి పొందితేనే కొత్త బోర్‌వెల్స్‌కు అనువ-ంతులు ఇస్తారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా బోర్లు వేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్లకు హెచ్చరిక జారీ చేశారు.గ్రామాల్లో జరిగే భూ రీసర్వే ఎటువంటి తప్పులు లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి.సర్వే బృందాల పనితీరును పెంచేందుకు జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.సర్వే పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు తప్పుల్లేని డిజిటల్ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

# కూటమిది అభివృద్ధి విజన్ - వైసీపీది విధ్వంస విజన్

**అభివృద్ధికి వైసీపీ అడుగడుగునా ఆటంకమే: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య:రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే, వైసీపీ మాత్రం అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు సృష్టిస్తూ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విమర్శించారు.'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోనేనాయక్ తండా, బడే నాయక్ తండాల్లో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా స్థానికులు వీధి దీపాలు, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పుట్టపర్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు, సోలార్ ప్రాజెక్టులు, సాగునీటి అభివృద్ధి పనులతో వేగంగా అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, గంగాధర నాయుడు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల గొంతు నొక్కే ఫాసిస్టు కుట్రలను ప్రజలు చిత్తు చేస్తారు



అనంతపురం, జూలై 31 అనంత సూర్య : దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపడుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాలను అణచివేసేందుకు అధికార యంత్రాంగాన్ని, సామాజిక మాధ్యమాలను వినియోగిస్తూ జరుగుతున్న దుష్ప్రచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జీ. సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను దేశద్రోహులుగా, విదేశీ శక్తుల ప్రతినిధులుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆయన అన్నారు. నిరాధార ఆరోపణలు చేసి విద్యార్థి ఉద్యమాన్ని అపఖ్యాతిపాలు చేసే ప్రయత్నాలు ఎంత చేసినా, ప్రజల మద్దతుతో ఈ ఉద్యమాలు మరింత బలపడతాయని స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ పై చట్టప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అసత్య ప్రచారం ద్వారా ఉద్రిక్తతలను రెచ్చగొట్టే యూట్యూబ్ ఛానళ్లు, సామాజిక మాధ్యమ ఖాతాలు, సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువజన నాయకులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.1 కోటి పరిహారం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొడతారని, విద్యార్థుల హక్కుల కోసం ఏఐవైఎఫ్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని జీ. సంతోష్ కుమార్ స్పష్టం చేశారు.

# విద్యార్థులకు అన్నదానం, అవగాహన



అనంతపురం, జులై 31 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో కోవూరు నగర్ లో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానంతో పాటు అవగాహన కల్పించారు. శుక్రవారం శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో ట్రస్ట్ సభ్యులు కావేరి శ్రీహరనాథ్ వారి కుమారుడు శ్రీదీప్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమము సాకారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని చదువులో కొనసాగించాలన్నారు. చదువులో విజయం సాధించగలిగితే భవిష్యత్తులో జీవితంలోనూ విజయం సాధించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. పెద్దల ఆశీస్సులు ఉంటే జీవితంలో కుటుంబ బాధ్యతలు, జీవన విధానాలు అలవాడుతాయన్నారు. ప్రతి విద్యార్థి తన అనుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు పట్టు వదలని శ్రమతో కష్టపడాలన్నారు. తోటి వారికి సహాయం చేసే గుణం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు శ్రీ స్వామి సత్యాత్మానంద, శ్రీ చక్రపాణి, ట్రస్ట్ సభ్యులు శ్రీదీప్ మేనత్త విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపించాం





అనంతపురం, జూలై 31 అనంత సూర్య : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 20 నుంచి 30ఏళ్లుగా ఉన్న సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 39వ డివిజన్ లక్ష్మీనగర్ లో పర్యటించారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందాయా.. డివిజన్ లో ఇంకా ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలా అని అడుగుతూ ముందుకు సాగారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మా పాలనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. రెండేళ్లలోనే మౌళిక వసతులకు నియోజవర్గంలో 200కోట్లు ఖర్చు చేశామన్నారు. 1296కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. 20ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. 39వ డివిజన్ లో మాత్రమే కోటి రూపాయలతో వివిధ కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. 20లక్షలతో ముస్లిం మైనార్టీలకు కమ్యూనిటీ భవనం నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలనలో డంపింగ్ యార్డుల్లో లక్ష టన్నుల చెత్త పెట్టిపోయారన్నారు. ఇప్పటికే 80శాతం వరకు తమ ప్రభుత్వం దానిని తొలగించిందన్నారు. నగరానికి డంపింగ్ యార్డు పెద్ద సమస్యగా మారిందని.. అందుకే తమ ప్రభుత్వం వచ్చాక.. దానిని తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే 80శాతం పైగా పూర్తైందని అక్టోబర్-2 నాటికి చెత్త లేకుండా చేసి అక్కడ ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మిగిలిన స్థలంలో పార్కు నిర్మించబోతున్నామని వివరించారు. నగరంలో స్మార్ట్ సిటీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లులు ఆదా చేస-్తున్నట్టు వెల్లడించారు. నడమివంక, మరువ వంకకు ప్రొటెక్షన్ వాల్స్, కమ్యూనిటీ భవనాలు నిర్మిసా-్తమన్నారు. కొత్త పింఛన్లు కావాలని చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. త్వరలోనే వాటిని మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం కేవలం బటన్లు నొక్కి ప్రజల్ని మభ్య పెడితే తాము ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ చేపల హరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, టిడిపి నాయకులు రాయల్ మధు, ఇస్మాయిల్, ఓంకార్ రెడ్డి, కరీం, కురుబ నారాయణస్వామి, సింగవరం రవి, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, కడియాల కొండన్న, బిజెపి జిల్లా నాయకుడు అశోక్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకుడు అశోక్ రెడ్డి, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వంకరకుంటలో సివిల్ రైట్స్ డే నిర్వహణ

**కాలనీవాసుల సమస్యలపై అధికారుల ఆరా - పరిష్కారానికి హామీ**



నల్లమాడ, జూలై 31 అనంత సూర్య:శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం వంకరకుంట గ్రామంలో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ఎస్సీ కాలనీలోని స్మశానవాటిక, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు.కార్యక్రమంలో పాల్గొన్న డివీఎంసీ సభ్యుడు రామాంజనేయులు, మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో), స్థానిక ఎస్ఐ కాలనీవాసులతో సమావేశమై పౌర హక్కులు, సామాజిక ఐక్యత, సమానత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కాలనీవాసులు పరస్పర సహకారంతో, ఐకమత్యంతో జీవించాలని, ఎలాంటి వివక్షకు లేదా దోపిడీకి బానిసలు కాకుండా తమ హక్కులను పరిరక్షించుకోవాలని ఎస్ఐ సూచించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఎంఆర్వో దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివీఎంసీ సభ్యుడు రామాంజనేయులు, ఎంఆర్వో, ఎస్ఐ, సంబంధిత శాఖల సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

**రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీ తనిఖీ**



ధర్మవరం, జూలై 31 అనంత సూర్య:ధర్మవరం మార్కెట్ యార్డులోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గోడౌన్‌లోని భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. గోడౌన్ వద్ద 24 గంటలపాటు పటిష్టమైన భద్రతా నిఘా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.తనిఖీ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి, ఈవీఎంల భద్రతా విధానాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రాంభూపాల్ రెడ్డి, ధర్మవరం తహసీల్దార్ దేవరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్పెయిన్‌లో చదరంగం పోటీల్లో మెరిసిన శ్యామ్యూల్ నోబుల్

**ఏడాది కోచింగ్‌కు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**





అనంతపురం, జూలై 31 అనంత సూర్య:అనంతపురం జిల్లాకు చెందిన 13 ఏళ్ల చదరంగం క్రీడాకారుడు, కాండిడేట్ మాస్టర్ (సీఎం) శ్యామ్యూల్ స్టీఫెన్ నోబుల్ స్పెయిన్‌లో జరిగిన అంతర్జాతీయ చదరంగం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.జూలై నెలలో స్పెయిన్‌లో జరిగిన మూడు అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్న శ్యామ్యూల్ మొత్తం 453.2 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించి, తన లైవ్ రేటింగ్‌ను 2011 నుంచి 2464.2కు పెంచుకున్నాడు.ఈ ప్రదర్శనతో అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను మరోసారి చాటుకున్నాడు.శ్యామ్యూల్ ప్రతిభను గుర్తించిన కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అతని మెరుగైన శిక్షణ కోసం రేస్ అకాడమీలో ఏడాది కోచింగ్ ఫీజును స్వయంగా భరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, ఎస్ఆర్‌సీ ట్రస్ట్‌కు క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.శ్యామ్యూల్ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

# ప్రతి అర్జీ పరిష్కారమే మా బాధ్యత

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- 52వ ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ..

**అధికారులకు వెంటనే ఆదేశాలు**




అనంతపురం, జులై 31 అనంత సూర్య : ప్రజల నుంచి అర్జీలను పరిష్కరించడమే తమ లక్ష్యమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 52వ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, ప్రతి సమస్యను స్వ-యంగా పరిశీలించారు. వినతిపత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఏ సమస్యనూ పెండింగ్‌లో ఉంచబోమని, ప్రతి అర్జీకి నిర్ణీత గడువులో పరిష్కారం చూపించేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్న దగ్గుపాటి ప్రసాద్, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని అన్నారు. ప్రజా దర్బార్ ద్వారా సామాన్యుల సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి చేరుతున్నాయని, సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ప్రజల సమస్యలను గడువులోగా పరిష్కరించాలి



**'ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**

కూడేరు, జూలై 31 అనంత సూర్య:కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో నిర్వహిస్తున్న 'ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా వరుసగా మూడో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాధ్యం కాని వాటికి కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా భూ సమస్యలు, ఇళ్ల పట్టాలు, విద్యుత్, తాగునీరు, వ్యవసాయం, విద్య తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వచ్చే వారంలో నిర్వహించే సమావేశానికి అర్జీదారులను పిలిచి, వారి వినతుల పరిష్కార స్థితిని వివరించాలని ఆదేశించారు. మూడు వారాల్లో మొత్తం 325 అర్జీలు స్వీకరించగా, వాటన్నింటినీ నాలుగో వారంలోగా పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్ కుమార్, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి గ్లోబల్ బాలవికాస్ గురువుల మహాసమ్మేళనం ప్రారంభం









**16 దేశాల నుంచి 3 వేల మంది గుర-ువులు, సమన్వయకర్తలు, విద్యావేత్తలు**

పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య:భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య సన్నిధి ప్రశాంతి నిలయంలో మూడు రోజులపాటు జరిగే శ్రీ సత్యసాయి గ్లోబల్ బాలవికాస్ గురువుల మహాసమ్మేళనం--2026 శుక్రవారం సాయి కుల్వంత్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. 16 దేశాలకు చెందిన దాదాపు 3,000 మంది బాలవికాస్ గురువులు, సమన్వయకర్తలు, విద్యావేత్తలు ఈ మహాసమ్మేళనంలో పాల్గొన్నారు. సత్యాన్ని నిలబెడుతూ... హృదయాలను తీర్చిదిద్దుతూ... శ్రేష్ఠతను వికసింపజేస్తూ "అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సమ్మేళనాన్ని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్ ఇతర ప్రముఖులతో కలిసి ప్రారంభించారు. అనంతరం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ప్రతినిధులు భక్తి పూర్వకంగా సభాస్థలికి చేరుకున్నారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా 'ది ట్రిపుల్ డివైన్ బాండ్ ఆఫ్ బాలవికాస్' ప్రత్యేక సంచిక, శతజయంతి, గురుపూర్ణిమ ప్రత్యేక మేగజైన్‌లు, గ్రూప్--1 బాలవికాస్ గురువుల హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. స్వాగతోపన్యాసం చేసిన నిమిష్ పాండ్యా, బాలవికాస్‌ను భగవాన్ ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరంగా అభివర్ణిస్తూ, వ్యక్తిత్వ వికాసం, మానవ విలువల పెంపొందింపే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సాయి ప్రియ విజయరాఘవన్ మాట్లాడుతూ, గురువు పిల్లలకు ఆదర్శంగా నిలిచి ప్రేమ, విశ్వాసం, ఆచరణతో విలువలను బోధించాలని సూచించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ అంతర్జాతీయ మహాసమ్మేళనంలో సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస వంటి మానవ విలువలను భావితరాలకు అందించే అంశాలపై వివిధ సదస్సులు, చర్చలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా బాలవికాస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి దోహదపడనుందని నిర్వాహకులు తెలిపారు.

# డీఆర్‌డీఓ కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి





**♦ జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వినతి**

పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య:పుట్టపర్తిలో డీఆర్‌డీఓ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్--342) నిర్మాణం కోసం సేకరించిన భూములకు 2021లోనే ఎకరాకు రూ.32 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు నష్టపరిహారం చెల్లించామని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, డీఆర్‌డీఓ కోసం సేకరిస్తున్న భూములకు కూడా రైతులకు న్యాయం జరిగేలా పరిహారాన్ని పునఃసమీక్షించి పెంచాలని కోరారు. అదేవిధంగా డిఎస్సి--2025లో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మరో వినతిపత్రాన్ని కూడా జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త లక్కప్పతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# మేడాపురంలో ఆగస్టు 2న ఉచిత వైద్య శిబిరం



**♦ మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు - రోటరీ క్లబ్, గండికోట హాస్పిటల్ ఆధ్వర్యంలో**

ధర్మవరం, జూలై 31 అనంత సూర్య:రోటరీ క్లబ్ ధర్మవరం మిడ్‌టౌన్, గండికోట హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 2 (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో మహిళలకు గర్భాశ-య సంబంధిత వ్యాధులు, గర్భిణుల ఆరోగ్య పరీక్షలు, సంతాన సమస్యలపై ప్రత్యేక వైద్య సేవలు అందించడంతో పాటు, జనరల్ ఫిజీషియన్ ద్వారా బీపీ, షుగర్, థైరాయిడ్, విషజ్వరాలు, గుండె జబ్బులు తదితర వ్యాధులకు ఉచిత పరీక్షలు, మందులు అందజేయనున్నట్లు గండికోట హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ ధర్మవరం మిడ్‌టౌన్ అధ్యక్షుడు కె. జయసింహా, కార్యదర్శి ఎం. చంద్రశేఖర్, ట్రెజరర్ కె. పెద్దారెడ్డి, ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, శిబిర నిర్వాహకులు సోలిగాళ్ల వెంకటేశులు, ఎస్. ప్రసన్నకుమార్, కె. నరేంద్రరెడ్డి తదితరులు కోరారు.

# సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆస్ట్రియాలో ఉద్యోగ అవకాశాల దిశగా మరో ముందడుగు

**ఆర్‌ఐటీ కార్యక్రమంలో మాడ్యూల్స్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు**




పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య: పుట్టపర్తిలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిర్వహిస్తున్న ది రైజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టెక్నాలజీస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల దిశగా మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. రిసెర్చ్ ఇండస్ట్రియల్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ఆస్ట్రియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్ ఐ ఎస్ ఇ, ఆస్ట్రియా మరియు వియన్నా విశ్వవిద్యాలయానికి చెందిన విదేశీ అధ్యాపకులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై బోధన, శిక్షణ, ప్రాజెక్టు మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో తొమ్మిది మంది విద్యార్థులు మాడ్యూల్--3ను, పన్నెండు మంది విద్యార్థులు మాడ్యూల్--2ను విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఐటీ ప్రోగ్రామ్ మెంటర్ రైముండ్ రిట్నర్ మాట్లాడుతూ, మాడ్యూల్--4ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఆర్ ఐ ఎస్ ఇ, ఆస్ట్రియాలో పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సంవత్సరానికి సుమారు రూ.19.6 లక్షల స్టైపెండ్ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, పరిశ్రమ అనుభవాన్ని అందిస్తూ ప్రపంచ స్థాయి కెరీర్ అవకాశాలకు సిద్ధం చేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఆర్ ఐ టి వంటి అంతర్జాతీయ కార్యక్రమాల ద్వారా విదేశీ నిపుణులతో కలిసి పనిచేసే అవకాశాలు లభించడం సంస్థకు గర్వకారణమని వెల్లడించింది. కార్యక్రమంలో కళాశాల యా-జమాన్యం, అధ్యాపకులు, ఆర్ ఐ టి సమన్వయకర్తలు, విద్యార్థులు పాల్గొని మాడ్యూల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పుట్టపర్తి నూతన డీఎస్పీ



పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య: పుట్టపర్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మగడ్డ సత్యనారాయణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. మంగళ గిరి లోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన నిమ్మగడ్డ సత్యనారాయణ ఇటీవల పుట్టపర్తి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పుట్టపర్తి సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి సమర్థవంతంగా అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతమైన పోలీసింగ్ అందించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా విధులు నిర్వహించాలని డీఎస్పీకి సూచించారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్



పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య:ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ సూచించారు. శుక్రవారం స్థానిక పరేడ్ మైదానంలో ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణ, క్రమశిక్షణ, ఆరోగ్య సంరక్షణ, ఎస్కార్ట్ డ్యూటీలు, పరేడ్ నిర్వహణతో పాటు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విధుల నిర్వహణలో ఎలాంటి రాజీ పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎస్కార్ట్ డ్యూటీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిం చాలని ఆదేశించారు. శారీరక దృఢత్వాన్ని కాపాడు కుంటూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విధులకు సంబంధించి లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మహేష్, వలి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు వీరన్న, ప్రసాద్, కృష్ణ నాయక్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



# డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి





### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బర్తరఫ్ చేయాలని వైఎస్ఆర్‌సీపీ డిమాండ్

అనంతపురం, జూలై 31 అనంత సూర్య: డీఎస్సీ--2025 నియామకాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బర్తరఫ్ చేయాలని అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ తమ వద్ద ఉన్న ఆధారాలు, వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను జేసీకి అందజేశా-రు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు ప్రతి నిరుద్యోగికి 25 నెలలకు గాను రూ.75 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ అక్రమాలపై ఆగస్టు 3 నుంచి నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు, రిలే దీక్షలు నిర్వహిస్తామని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వయకర్తలు శైలజానాథ్, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు పలువురు వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ జాతీయ కార్యదర్శిగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సత్యకుమార్‌కు అభినందనలు

ధర్మవరం జులై 31 అనంత సూర్య: బీజేపీ జాతీయ కార్యదర్శిగా విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఏబీవీపీ కార్యకర్తగా ప్రజా జీవితాన్ని ప్రారంభించిన ఆయన, అంకిత భావం, క్రమశిక్షణ, నిరంతర శ్రవ-ంతో భారతీయ జనతా పార్టీలో జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదగడంతో పాటు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిం చడం య-ంవతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వంటి జాతీయ నాయకత్వంతో సమన్వయంగా పనిచేస్తూ, తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడిగా సత్యకుమార్ ఎదగడం గర్వకారణమని అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని దేశ సేవలో విశేషంగా రాణించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల 'చలో కలెక్టరేట్'









### కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్

పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు శుక్రవారం పుట్టపర్తిలో 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కనీస వేతనం నెలకు రూ.26,000 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గణేష్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యలను వివరిస్తూ సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ప్రజారోగ్యం, శిశు సంక్షేమం, మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన వేతనాలు, సంక్షేమ సదుపాయాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశా-రు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని నెలకు రూ.26,000గా నిర్ణయించాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల న్యాయ-ంమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆగస్టు 15న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని కొనసాగి-స్తారని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు.

# వర్షాలు కురవాలని మసీదులో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు.

- **వర్షాలు కురవాలని బొడ్రాతమ్మ అమ్మవారికి బోనాలు**

నంబులపూలకుంట,జూలై 31అనంత సూర్య::నంబులపూలకుంట మండల కేంద్రంలోని జామియా మసీదులో హజరత్ యూసుఫ్ జుమ్మా నమాజు సందర్భంగా వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు,(దువా) నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ యూసుఫ్





వర్షాలు బాగా సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించారు. వర్షాలు కురవాలని బొడ్రాతమ్మ అమ్మవారికి బోనాలు-దిగువపల్లి గ్రామంలో ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహించే బొడ్రాతమ్మ అమ్మవారి బోనాల వేడుకను శుక్రవారం గ్రామంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలో గత మూడు నెలలుగా సరైన వర్షాలు లేక రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని,గ్రామ ప్రజలంతా సుఖ శాంతులతో,సుభిక్షంగా జీవించాలని కోరుకుంటూ ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు తీసుకువచ్చి గ్రామ నడిబొడ్డులో వెలసిన బొడ్రాతమ్మ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి గ్రామ ప్రజలకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గ్రామ సంప్రదాయం ప్రకారం కోళ్లు, పొట్టేళ్ల జాతర కూడా నిర్వహించారు. ఈ వేడుకలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని బొడ్రాతమ్మ అమ్మవారిని వేడుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బోనాల వేడుకతో దిగువపల్లి గ్రామంలో భక్తిమయ వాతావరణం నెలకొంది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి



### జిల్లా కలెక్టర్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రం

పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య: రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా పరిగణించాలని కోరారు .జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ పథకం అమలు, సమాచార శాఖను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ మాసపత్రిక ప్రచురణను పునరుద్ధరించడం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, జర్నలిస్టుల సంక్షేమ కమిటీల ఏర్పాటు, వెల్ఫేర్ ఫండ్‌కు తగిన నిధుల కేటాయింపు, మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, జర్నలిస్టు అవార్డుల పునరుద్ధరణ, కార్మిక బీమా సదుపాయం కల్పించడం, వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని చేరవేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ఎల్. శివరామకృష్ణ (ఐ న్యూస్), సాక్షి రాజేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జీమాని కేశప్ప (టీవీ9), పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి (6 టీవీ), ఈడగుట్టు రవిశంకర్ (99 టీవీ), జయప్రకాష్ (స్వతంత్ర టీవీ), సి. సాయికుమార్ (బీఆర్‌కే టీవీ), మోహన్, నారాయణస్వామి, మారుతీ, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

- **రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**



పుట్టపర్తి, జూలై 31 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా నమోదు (ఎన్రోల్మెంట్) గడువును ఆగస్టు 15 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పంటలను బీమా పరిధిలోకి తీసుకురావాలని ఆయన కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం కంది, మొక్కజొన్న, ఆముదం, రాగి, వరి పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలులో ఉందన్నారు. ఈ పథకం కింద కంది పంటకు ఎకరానికి రూ.102, మొక్కజొన్నకు రూ.165, ఆముదానికి రూ.100, రాగికి రూ.100, వరికి రూ.200 చొప్పున ప్రీమియం చెల్లించి రైతులు ఆగస్టు 15లోపు బీమా పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో ఉన్న అసైన్డ్ భూములకు కూడా పంటల బీమా సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. ఇప్పటివరకు బీమా చేయించుకోని ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటలను బీమా పరిధిలో నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతు పంటల బీమా పథకంలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 21,868 హెక్టార్లు, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద 1,06,023 హెక్టార్లు నమోదు జరిగినట్లు కలెక్టర్ వెల్లడించారు..

# ఘనంగా ఉపాధ్యాయుడు గడిగట్ల రెడ్డప్ప పదవి విరమణ.

### పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు గడిగట్ల రెడ్డప్పని ఘనంగా సన్మానించిన తోటి ఉపాధ్యాయులు, సహచరులు.

నంబులపూలకుంట, జూలై 31అనంత సూర్య్::విద్యార్థులకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల త-రువాత వారి జీవితాలను తీర్చిదిద్దే గురువే అత్యంత ప్రధానమని మండల ఎంఈఓ గోపాల్ నాయక్ అన్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గడిగట్ల రెడ్డప్ప ని నంబులపూలకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, క్రమశిక్షణతో కూడిన విలువలను పెంపొందించిన రెడ్డప్ప సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన పదవీ విరమణ చేసినప్పటికీ, సమాజానికి ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యసాయి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులను విద్యావంతులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, అంకితభావం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను సమాజం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గడిగట్ల రెడ్డప్ప మాట్లాడుతూ తాను 1995వ సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చానని నల్లచెరువు మండలంలో మొదటగా ఉపాధ్యాయుడిగా పనిచేశానన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. తనను కదిరి నియోజకవర్గం దివంగత మాజీ ఎమ్మెల్యే జొన్న సూర్యనారాయణ గుర్తించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు,పూర్వ విద్యార్థులు కలిసి గడిగట్ల రెడ్డప్పను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ఆయన సేవలను ప్రశంసించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,పూర్వ విద్యార్థులు,విద్యా శాఖ అధికారులు,ఫ్యాప్టో నాయకులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405